క్లుప్తంగా

నేడు మహిళా దినోత్సవం

దామెర : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఊరుగొండ గ్రామంలోని ఆర్కే కన్వెన్షన్ హాలులో నేడు (మంగళవారం) ఉదయం 9 గంటలకు నియోజకవర్గ స్థాయి మహిళా దినోత్సవం నిర్వహించనున్నట్లు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


తరుణ్ (ఫైల్)

దామెర : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ల్యాదెల్ల శివారులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ కథనం ప్రకారం.. శాయంపేట మండలంలోని పత్తిపాకకు చెందిన గజ్జి తరుణ్ పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి బైక్‌పై హనుమకొండకు బయల్దేరిన ఆయన ల్యాదెల్ల శివారు ఎస్సారెస్పీ కెనాల్ వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి బ్రిడ్జీని ఢీకొట్టాడు. దీంతో వాహనం కాల్వలో పడిపోగా తరణ్ రోడ్డుకు బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆయన ఛాతికి, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది శ్రీనివాస్, మహేందర్ వాహనంలో అక్కడకు చేరుకుని తరుణ్‌ను చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతున్న ఒకరు..

పరకాల : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాలిలా.. మండలంలోని పోచారం గ్రామానికి చెందిన దార సాంబయ్య (57) ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు యత్నించగా కుటుంబీకులు ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పారు. కాగా సాంబయ్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య సాంబక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగదీశ్ మృతి తీరని లోటు



ఆత్మకూరు : ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ మృతి తీరని లోటని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర నాయకుడు మచ్చిక యాదగిరి గౌడ్ అన్నారు.మండలంలోని కటాక్షపూర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ జనసభ నుంచి జగదీశ్ పేదల కోసం లాఠీ దెబ్బలను సైతం లెక్క చేయక పోరాడిన యోధుడని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో జగదీశ్ పాత్ర మరువలేనిదని చెప్పారు. నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడే నాయకుడిని కోల్పోయామని ఆందోళన వెలిబుచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ విద్యార్థివి భాగం ఉమ్మడి జిల్లా కార్యదర్శి అర్షం మధూకర్, నాయకులు కుడుతల రమేష్, వంగేటి ప్రభాకర్, దుండ్ర శ్రీనివాస్, ఆదిరెడ్డి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



ఐనవోలు : మండలంలోని రాంనగర్ గ్రామానికి చెందిన ఉల్లెంగుల సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నేషనల్ దోబీ రిజర్వేషన్ సంఘ జాతీయ కన్వీనర్ నడిగింటి శ్రీనివాస్, జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లేంగుల యాదగిరి సోమవారం పరామర్శించారు. సంపత్ మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వీరి వెంట తెలంగాణ రజక రిజర్వేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రజక ఉద్యమ నేత మడల్ వీరన్న, జనగాం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు తదితరులు ఉన్నారు.

ముగ్గురిపై కేసు

కాజీపేట : రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) ఎస్సైపై దాడికి పాల్పడి గాయపర్చిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ అంగడి రాజు అనే ఆర్పీఎఫ్ ఎస్సై ఫాతిమానగర్ బ్రిడ్జి సమీపంలో రైల్వే ట్రాక్‌పై తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ట్రాక్‌పై నిలబడి మద్యం సేవిస్తున్నారు. రైళ్లు వచ్చే సమయం అయిందని, అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించగా ఆగ్రహంతో వారు డ్యూటీ డ్రెస్‌లో ఉన్న ఎస్సైపై దాడి చేసి గాయపర్చారు. ఎస్సై సెల్‌ఫోన్ ధ్వంసం చేశారని సీఐ వివరించారు.

సర్వసభ్య సమావేశంలో గందరగోళం

- అధికారులపై సర్పంచ్ మండిపాటు, నిరసన

దామెర : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో గందరగోళం నెలకొంది. ఎంపీపీ కాగితాల శంకర్ అధ్యక్షత వహించగా అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. విద్యుత్ శాఖ ఏఈ గుర్రం రమేష్ నివేదిక సమర్పిస్తున్న క్రమంలో దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి అడ్డుపడ్డారు. తనకు తెలియకుండానే ఎస్సీ, ఎస్టీల ఇళ్ల కరెంటు వైర్లను ఎలా తొలగిస్తారని మండిపడ్డారు. ఏఈ సమాధానం చెబుతున్నా వినకుండా గ్రామ పంచాయతీలకు కోట్లాది రూపాయలు బాకీ ఉన్నా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహిస్తోందని అధికారులను ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సిగ్గులేకుండా వ్యవహరిస్తున్నారంటూ దుర్భాషలాడారు. ఎంపీపీ శంకర్, తహసీల్దార్ రియాజుద్దీన్ సమాధానం చెబుతున్నా వినకుండా సభ ఎదుట నల్ల కండువా ధరించి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో సర్పంచ్ శ్రీరాంరెడ్డికి, ప్రజాప్రతినిధులకు నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమను దుర్భాషలాడిన సర్పంచ్ శ్రీరాంరెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. దీంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది.


సర్పంచ్ శ్రీరాంరెడ్డితో వాగ్వాదం చేస్తున్న సభ్యులు

సర్పంచ్ శ్రీరాంరెడ్డి క్షమాపణ చెప్పాలి

సమాధానం చెబుతున్నా వినిపించుకోకుండా తమను దుర్భాషలాడిన సర్పంచ్ శ్రీరాంరెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ప్రజాప్రతినిధులు, అధికారులు డిమాండ్ చేశారు. సమావేశం నుంచి బయటికి వచ్చిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి సమావేశంలోనూ గొడవచేయడం, స్థాయికి మించి రాష్ట్రస్థాయి అంశాలు ప్రస్తావించడం సర్పంచ్ శ్రీరాంరెడ్డికి అలవాటుగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు సిగ్గులేదనడం సరికాదన్నారు. సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంపీపీ శంకర్ తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ గరిగె కల్పన కృష్ణమూర్తి, ఎంపీడీఓ రవీందర్, ఎంఈఓ రమాదేవి, ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గండు రాము, మౌనిక కిరణ్, సర్పంచ్‌లు సత్యనారాయణరెడ్డి, అశోక్, శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పాఠశాలల పునఃప్రారంభం


ధర్మసాగర్ : విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మాధవరెడ్డి, హెచ్‌ఎంలు


ధర్మసాగర్ : బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ధర్మసాగర్ : ధర్మసాగర్, వేలేరు మండలాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు వేసవి సెలవులు ముగియడంతో సోమవారం ప్రారంభమయ్యాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ఆధ్వర్యంలో పాఠశాలలను మామిడి తోరణాలు, పూలదండలతో అలంకరించారు. వేలేరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం నాగకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేశారు. వేలేరు ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బాడిబాట ర్యాలీ నిర్వహించగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ సూత్రపు తిరుమల, సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిగంట మోగింది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేయించారు. ద్వారాలకు, గేట్లకు మామిడి తోరణాలు కట్టి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వాగతం పలికారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పాఠశాలల్లో హాజరు శాతం తక్కువగా నమోదైంది. విద్యార్థుల కోసం ఆయా పాఠశాలలను పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు సీఆర్పీ రాజు తెలిపారు.


ఐనవోలు : విద్యార్థులతో ఉపాధ్యాయులు

'ఓటరు' సవరణను వేగవంతం చేయండి


ఆత్మకూరు : మాట్లాడుతున్న ఆర్డీఓ రాము

ఆత్మకూరు : ఓటరు జాబితా సవరణను వేగవంతం చేయాలని బీఎల్‌ఓలను ఆర్డీఓ రాము ఆదేశించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు, వీఆర్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఓటరు జాబితాలో తప్పులుంటే సరి చేయాలని సూచించారు. అలాగే 18 ఏళ్లకుపైబడ్డ వ్యక్తుల వివరాలు సేకరించి ఓటు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సంగీత, సూపర్‌వైజర్లు రవీందర్‌రావు, దామోదర్, బీఎల్‌ఓలు వంగేటి సత్యం, జంగ శ్రీకాంత్, రవి, చంద్రమౌళి పాల్గొన్నారు.


శాయంపేట : మాట్లాడుతున్న డీటీ భద్రునాయక్

దామెర : మండల కేంద్రంలోని రైతు వేదికకలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆర్డీఓ రాము మాట్లాడారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, నాయబ్ తహసీల్దార్ రామకృష్ణ, ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఏఎస్‌ఓ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్ సమీక్షించారు. ఓటరు జాబితాలోని మృతుల పేర్లతోపాటు డబుల్ ఓట్లను గుర్తించి తొలగించాలని చెప్పారు. సమావేశంలో బీఎల్‌ఓలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో గట్లకనిపర్తి వాసుల సేవలు



శాయంపేట : ఏపీ రాష్ట్రంలోని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మండలంలోని గట్లకనిపర్తికి చెందిన శ్రీ వెంకటేశ్వర శరణాగతి శివాలయం భజన మండలి సభ్యులు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఆఖండ హరినామ సంకీర్తన చేశారు. కార్యక్రమంలో మండలి సభ్యులు గూడ వాసుదేవమూర్తి, అశోక్‌కుమార్, కుమారస్వామి, పూర్ణాచారి, శేషుకుమార్, సంతోశ్‌బాబు, మధు, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ వృత్తిదారులకు రుణాలు కొత్త నాటకం'

శాయంపేట : సీఎం కేసీఆర్ రాబోయే ఎన్నికల్లో బీసీ ఓట్లను రాబట్టుకుని రాజకీయ లబ్ధి పొందడానికే బీసీ కులాల వృత్తిదారులకు లక్ష రూపాయల రుణాన్ని అందిస్తామంటూ కొత్త నాటకానికి తెర లేపారని వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు మారపల్లి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం రూ.120 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని మండిపడ్డారు. ఈనెల 2 నుంచి 22 వరకు దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ పార్టీ రాజకీయ ప్రచారం చేసుకుంటోందని తెలిపారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, శాయంపేట–ఆత్మకూర్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడం లాంటి సమస్యలతో ప్రజలు సతమతమౌతున్నారని పేర్కొన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ప్రత్యేక చొరవ తీసుకుని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే దళితబంధు తరహాలో పథకం వర్తింపజేసి బీసీ పేదలను ఆదుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో బీసీల చేతిలో బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ప్రజాప్రతినిధి ముసుగులో కాంట్రాక్టర్

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి

నడికూడ : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రజాప్రతినిధి ముసుగులో ఉన్న కాంట్రాక్టర్‌గా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నోజు శ్రీనివాస్‌చారి అభివర్ణించారు. మండలంలోని చర్లపల్లి గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నేరవేర్చని ప్రభుత్వాన్ని నిలదీస్తూ, కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రజాసమస్యలను విస్మరించి స్వార్థపూరిత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. బీసీ సామాజికవర్గానికి చెందిన తనను రానున్న ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజాసేవకే అంకితం అవుతానని చెప్పారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రజాసమస్యలను పక్కనపెట్టి వేలాది కోట్ల బినామీ కాంట్రాక్టులు తీసుకుంటూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నాడని తెలిపారు. రాబోయే రోజుల్లో పరకాల నియోజకవర్గంలో టీడీపీని బలోపేతం చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తామని వివరించారు. కార్యక్రమంలో నాయకులు లక్కం ప్రకాశ్, శ్రీనివాస్, బ్రహ్మచారి, రామన్న, దిలీప్, శివ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.


మహిళతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌చారి

'జీపీ'లో రాష్ట్ర ప్రత్యేక అధికారి తనిఖీ

ధర్మసాగర్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న నిర్వహించనున్న 'పల్లె ప్రగతి దినోత్సవం' సందర్భంగా మండలంలోని తాటికాయల గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రత్యేక అధికారి శ్రీదేవి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పంచాయతీ సఫాయి కార్మికులకు బట్టలు, గ్లౌస్‌లు, షూ, ప్రశంసా పత్రాలు, ఆ రోజు ఏర్పాటు చేయాల్సిన 6 ఫ్లెక్సీలు, జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లపై పరిశీలించారు. పల్లె ప్రగతి దినోత్సవ ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వనం జగదీశ్వర్, మండల పంచాయితీ అధికారి కరుణాకర్‌రెడ్డి, సర్పంచ్ పెసరు రమేశ్, ఎంపీటీసీ ననుబాల సోమక్క, పంచాయతీ కార్యదర్శి అనగాని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న శ్రీదేవి

మహిళలకు సాంత్వనే 'సఖి' ధ్యేయం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న హరిత

నడికూడ : కష్టాల్లో ఉన్న మహిళలకు అండగా నిలిచి సాంత్వన కల్పించడమే సఖి కేంద్రం ధ్యేయమని కేస్ వర్కర్ హరిత తెలిపారు. మండల కేంద్రంలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. గ్రామ స్థాయిలో బాధిత మహిళలకు అవసరమైన సహాయాన్ని అందించాలని ఆశ కార్యకర్తలకు సూచించారు. మహిళా సాధికారత కోసం సమాజంలోని ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆకాంక్షించారు. సమాజంలో మహిళా సమానత్వం కోసం పాటుపడే వ్యవస్థలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్‌లో 14 మంది సిబ్బంది, రెస్క్యూ వ్యాన్ అందుబాటులో ఉండి బాధిత మహిళలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సెలింగ్ చేయడంతోపాటు వైద్య, తాత్కాలిక వసతి, పోలీస్, న్యాయ సహాయాలు అందుతాయని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో బాధిత మహిళలు డయల్ 100, 181, 0870–2452112 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు. బాధిత మహిళలు సఖి సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నారగాని అనిత, సఖి కేంద్ర సిబ్బంది సరిత, అనూశ పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహాల ప్రతిష్ఠాపన


విగ్రహాల ఊరేగింపునకు బయల్దేరిన వాహనాలు

ఎల్కతుర్తి : మండలంలోని పెంచికలపేటలో శ్రీభక్తాంజనేయ సమేత, రామలింగేశ్వరస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు కనుల పండువలా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేదస్వస్తి, యాగ సంకల్పం, గోపూజ, విఘ్నేశ్వర పూజ, స్వస్తి పుణ్యాహవచనం. నాంది, కులదేవత ఆహ్వానం, ఋత్విక్ వర్ణన, పంచగవ్య ప్రాశన, దీక్షా ధారణ, యాగశాల సంస్కారం, అఖండ దీపాస్థాపన, నవగ్రహ, యోగిని, సర్వతోభద్ర మంటప దేవత ఆరాధన, అగ్నిమథనం, అగ్ని ప్రతిష్ఠ, కుండ సంస్కారం, దేవతామూర్తుల (విగ్రహాల) గ్రామోత్సవం, గణపతి హోమం, నవగ్రహ హోమం, బింబశుద్ధి, జలాదివాసం, హారతి, మంత్రపుష్పం, చతుర్వేద పారాయణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ సామల జమున సురేశ్‌రెడ్డి, ఎంపీటీసీ చెవుల కొమురయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు సామల మల్లారెడ్డి, నిర్వాహకులు, అన్నదాన నిర్వాహకులు ఎడవెల్లి అశోక్‌రెడ్డి, బాణాల ధన్‌రెడ్డి, బండి సాంబమూర్తి, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోరుకు 'నాయీ' సంఘం మద్దతు

పరకాల : పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా సాధన సమితి చేపట్టిన పోరాటానికి నాయీబ్రహ్మణ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ దుబాసి వెంకటస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మార్త భిక్షపతి మాట్లాడారు. బినామీల పేరుతో ఆస్తులను సంపాదించుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఉన్న చిత్తశుద్ధి పరకాల అభివృద్ధిపై లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో పరకాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో పరకాలకు చెందిన పలువురు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. పరకాల చాలా అభివృద్ధి చెందుతున్నప్పటికీ జిల్లాగా చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పరకాలను జిల్లాగా చేయాలని కోరారు. తొలుత సమితి ప్రతినిధులు స్థానిక అమరధామంలో సాధన సమితి నాయకులను సోమవారం కలిసి లిఖిత పూర్వకంగా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు తూముల బాబు, నాయకులు తూముల రఘువీర్, ముల్కనూర్ చంద్రయ్య, చిక్కుల అనిల్, ఐలుపల్లి సురేశ్, తూముల రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1988–89 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 34 ఏళ్ల క్రితం టెన్త్ పూర్తి చేసుకున్న వారు ఒకచోట చేరి ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి పాదాభివందనం చేశారు. తదనంతరం పాఠశాలకు 5 సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు పద్మలత, సదానందం, కొమురయ్య, అర్జీ, భద్రయ్య, రాజయ్య, చంద్రయ్య, పూర్వవిద్యార్థులు మాదాసు బాబు, అశోక్‌రావు, మోహన్‌రావు, రవ్వ శ్యామల, గబ్బెట ఎల్లస్వామి, ఎలంద్ర, ఎన్నంపెల్లి శివకుమార్, నారాయణ చారి, ముస్తఫా, మొగిలి, మహేందర్, యాకయ్య, రమేష్, కరుణాకర్ పాల్గొన్నారు.


నాటి ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

మోహన్‌రావు సేవలు చిరస్మరణీయం

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి

పరకాల : ప్రముఖ న్యాయవాది ఒంటెల మోహన్‌రావు సేవలు చిరస్మరణీయమని స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.చంద్రమౌళి తెలిపారు. మోహన్‌రావు మృతికి సంతాపంగా బార్ అసోసియేషన్ కార్యాలయలంలో న్యాయవాదులు సోమవారం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడారు. బడుగులకు న్యాయ సలహాలు, సేవలు అందించి వారి పక్షాన పోరాటం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఒంటేరు రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, పి.వెంకటరమణ, దొగ్గెల రమేష్, అకినపెల్లి రవికుమార్, తడుక సురేష్, న్యాయవాద క్లర్కులు ఎం.రమేశ్, అజీజ్‌పాషా, పూర్లె సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలకు రక్షణ కరువు

మడికొండ : డంపింగ్ యార్డ్‌తో కాజీపేట మండలంలోని మడికొండ, రాంపూర్, అయోధ్యపురం, తదితర గ్రామాల ప్రజలకు రక్షణ కరువైందని ఏఐసీసీ సభ్యుడు బక్క జడ్సన్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. అనంతరం బోర్డు అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్సన్ మాట్లాడారు. కాజీపేట మండలంలోని మడికొండ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు కారణంగా పొగ వస్తుండడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు శ్వాసకోస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్త చేశారు. అలాగే, చుట్టు పక్కల గ్రామాలైన టేకులగూడెం, అయోధ్యపురం, ధర్మసాగర్, కుమ్మరిగూడెం, తదితర గ్రామాల ప్రజలు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. 2020లో సుమారు రూ.36కోట్ల వ్యయంతో బయో మైనింగ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని చెప్పి.. ఇప్పటి పరిష్కరించలేదని విమర్శించారు.

వైద్యం వికటించి బాలుడి మృతి

- ఆస్పత్రి ఎదుట శవంతో ఆందోళన

పరకాల : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట రాత్రి 10 గంటలకు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. నడికూడ మండల కేంద్రానికి చెందిన బుర్ర సరిత–శరత్ దంపతుల చిన్న కుమారుడు జ్వరంతో బాధ పడుతుండగా పట్టణంలోని విజయ పాలి క్లినిక్‌కు తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన ఆస్పత్రి వైద్యుడు బి.విద్యాసాగర్‌రెడ్డి ఉదయం 10 గంటల నుంచి సెలైన్ పెట్టాడు. రాత్రి 7 గంటలకు మరో సెలైన్ పెట్టిన కొద్దిసేపటికే బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆరోగ్య పరిస్థితి విషమించింది. వైద్యుడి సూచన మేరకు బాలుడిని పరకాల నుంచి హనుమకొండలోనిమో ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బాలుడిని తీసుకెళ్లిన అంబులెన్స్‌ను ఆస్పత్రి ఎదుట ఉంచి బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. కొందరు ఆస్పత్రిపై దాడికి యత్నించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాడికి యత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని వదిలేశారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేస్తామని ఆస్పత్రి వైద్యుడు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.


బాలుడి శవంతో ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు

ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ చైర్మన్‌కు సన్మానం

కేయూ క్యాంపస్ : ఇండియన్ డ్రగ్ మాన్యుఫాక్చర్ అసోసియేషన్ చైర్మన్‌గా కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి రాజమౌళి ఇటీవల ఎన్నికయ్యారు. ఈ మేరకు రాజమౌళిని కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు సోమవారం ఘనంగా సన్మానించారు. అనంతరం గాదె సమ్మయ్య మాట్లాడారు. కరీంనగర్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన రాజమౌళి జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగారని కొనియాడారు. ఇతర విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం రాజమౌళి మాట్లాడారు. ఫార్మా పరిశ్రమలకు ప్రపంచంలో హైదరాబాద్‌కు ప్రముఖ స్థానం ఉందని వివరించారు.